# గులివింద గింజలు

చిట్టారెడ్డి సూర్యకుమారి

వాతావరణం ఆహ్లాదంగా వుంది.

లలితాదేవి విరిసిన గులాబీల దగ్గర నిల్చుని పూలభారంతో వంగిన మొక్కలను ఆనందంగా చూస్తూ పనివానితో తోటపని చేయిస్తూంది. మధ్య మధ్య మొక్కలను సవరిస్తూ అవసరమైన సలహాలు యిస్తూ స్వయంగా మొక్కలకు నీళ్ళు పోస్తూంది. ఇక కొన్నాళ్ళుపోతే తన కష్టం ఫలిస్తుంది. కూరగాయలన్నీ పంటకు వస్తాయి. శ్రీవారికి తన తోటలో పండించిన కూరగాయలతో కూరలుచేసి పెడుతుంది. పెరటిలో పండిన కూరగాయలు ఎంత రుచో.... లలితాదేవి ఆలోచనలు చాలా దూరం పోకముందే "నమస్కారమండీ!" అంటూ వచ్చింది మరో ఆఫీసరు సతీమణి శ్రీమతి.

శ్రీమతి తోటంతా కలయజూస్తూ "మీ రొచ్చి ఆరునెలలు కాలేదు యెడారిలా వున్న బంగళాని ఒయాసిస్సులా మార్చారు" అని మెచ్చుకుంటూ చటుక్కున పసుపు గులాబి త్రుంచి ఆఘ్రాణించి తలలో పెట్టుకుంటూ, "ఏమిటీ, కరేపాకు, నిమ్మచెట్టు కూడా వేశారే" అంటూ పకపక నవ్వింది.

నవ్వుతూ "అన్నాళ్ళు యిక్కడ వుందామనే!" అంది.

"మేము వుండకపోయినా మరో ఆఫీసర్ వస్తాడు, వాళ్ళు అనుభవిస్తారు - ఈ బంగళాకి అంత విశాలమైన చోటు వుంది. వృధాగా వదిలేస్తే యేం లాభం! రండి, రండి కూర్చుందాం" అంటూ నీళ్ళపైపు పనివాడికిచ్చి వచ్చింది.

వారు మాటల్లో వుండగా లలిత భర్త వేణు వచ్చాడు. వాకిట్లో వుండగానే "లల్లీ! మనకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది" అన్నాడు.

లలిత నోట మాట రానట్లు చూస్తూంటి పోయింది. వచ్చి ఆరునెలలు కూడా కాలేదు. పిల్లలు యిప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నారు. సంవత్సరం మధ్యలో వాళ్ళని తీసుకువెళ్ళి మరో స్కూల్లో చేర్పించి, మరల వాళ్ళు ఆ పరిసరాలకి, కొత్త టీచర్స్‌కి అలవాటుపడే లోపల సంవత్సరపు పరీక్షలు రానే వస్తాయి. ఈ విధంగా సంవత్సరం సంవత్సరం వూరూరు మారుతుంటే మంచి ఫౌండేషన్ పడేది యెప్పుడు? రేపు షట్ సూత్ర ప్రణాళికలో వీళ్ళకి యే కాలేజీలో సీటు వస్తుంది? వుద్యోగాలు యెక్కడ దొరుకుతాయి? ఆ తల్లి బాధ అంతా పిల్లల గురించే.


మంచి స్కూలు చూసి హాస్టల్లో చేర్పిద్దామంటే వచ్చే జీతంలో సర్దుబాటు కాదు. పేరుకు గజిటెడ్ ఆఫీసర్. కాని ఆ జీతం కుటుంబ ఖర్చులకు బొటాబొటీగా సరిపోతుంది. పై....పై....ఆదాయం యింట్లోకి రాదు. రావటానికి వీలులేదు. భర్త అతి నీతిమంతుడు. అందుకే యిన్ని కష్టాలు. ఎక్కడ నీతి అవసరమో అక్కడికి వేస్తుంటారు అతన్ని.

ట్రాన్స్‌ఫర్ వచ్చిన వూరుపేరు విని నోరు తెరిచింది లలిత. వీ రున్నది ఆంధ్రా. వెళ్ళవలసింది తెలంగాణా!

కుర్చీలో కదలక కూర్చున్న భార్యవైపు వంగుతూ "ఏమిటోయ్, మనకి ట్రాన్స్‌ఫర్లు కొత్తకాదుగా! నాకు నీవు నీకు నేను వుంటే ప్రపంచంలో యే మూలకు వెళ్ళినా మన యింట్లో వున్నట్టే వుంటుంది."

"ఆ..అయితే పూలకుండీలు మా కివ్వాలి."






ఆ మాట అంటున్న శ్రీమతిని అప్పుడు గుర్తించాడు. చూసి నమస్కరించాడు సిగ్గు సిగ్గుగా.

* * *

దొరల కాలంలో కట్టిన బంగళాలోకి భార్యతో వచ్చి దిగాడు రమణాజీ.

ముందు లాన్, పూలమొక్కలు. వెనుక కూరగాయల తోట. రంగులు కొట్టి కొత్త

బంగళాలా వున్న యింట్లో భార్య ఆనందంగా తిరుగుతుంటే రమణాజీ గర్వంగా మీసాలు తిప్పుకున్నాడు.

మంచి క్వార్టర్సు - వాతావరణం ఎప్పుడూ ఆహ్లాదంగా వుంటుంది. హాలిడేస్‌లో అటు బెంగుళూరు యిటు హైదరాబాదుకు పోవచ్చు. అన్నిటికంటె మాంచి డివిజన్, పై పైవి చాలా వుంటాయి. అన్నీ మజాలే. హై లెవల్లో ట్రైచేసి వచ్చాడు. పిచ్చి వేణు తినడు, మరొకడిని తిననివ్వడు.

సంవత్సరం మధ్యలో యెవ్వరిని ట్రాన్స్‌ఫర్ చేస్తే యెవ్వరు వూరుకుంటారు. ట్రాన్స్‌ఫర్ అనగానే ఛలో హైదరాబాదు అంటారు. డిపార్టుమెంటులో యే ఒకరో యిద్దరో వుంటారు మోరల్స్‌ను పట్టుకుని. వారిని నెపి పీలా వాడుకుంటారు అని వేణుమీద బోలెడు జాలిపడ్డాడు రమణాజీ.

కడుపులో చల్ల కదలకుండా జాలీగా కాలం గడిపేస్తున్నారు రమణాజీ దంపతులు.

* * *

వరలక్ష్మి గజిటెడ్ ఆఫీసర్ భార్య కాదు. యన్.జి.ఓ. భార్య. ఇంటి ముందు పందిరి వేయిస్తుంది. ఎండలు అమితంగా వున్నాయి. సగం యిల్లు రేకులతో కప్పివుండటం వలన పగలు యింట్లో వుండలేకపోతున్నారు. ఖర్చు అయితే అయిందని తెగించి పందిరి వేయిస్తూంది.

వరలక్ష్మి వాళ్ళు యీ వూరికి వచ్చి సంవత్సరమైంది. ఇక్కడి నీరు గాలి తనకు బాగా పట్టాయి. ఆరోగ్యం బాగుంది. పిల్లలకి స్కూలు దగ్గర్లోనే వుంది. అన్నిటికంటె ముఖ్యంగా అమ్మగారి వూరు దగ్గరగా వుంది. పిలిస్తే వస్తారు అవసరానికి. కాన్పు యిక్కడే చేసుకోవచ్చు. డబ్బుకు అంత భయపడ నవసరం లేదు.... అని తలుస్తూ పందిరి వేసే వాడికి సహాయం చేస్తూంది.

ఆ సమయాన భర్త శంకరప్ప పరుగు లాంటి నడకతో వచ్చి సగం వేసిన పందిరి క్రింద కూర్చున్నాడు. గర్భిణీతో వున్నా వంగి లేస్తూ పనిచేస్తున్న వరలక్ష్మి వైపు చూశాడు. అతని హృదయం కరిగిపోసాగింది. "వరలక్ష్మీ! యింకా యెందుకు పందిరి? మనకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది" పిడుగులాంటి వార్త చెవిన పడేశాడు.

"తమాషా చేస్తున్నారా?"

చొక్కా నేలకేసి కొడుతూ, "నిజం వరలక్ష్మీ!" అన్నాడు. వుస్సూరంటూ మెట్లపై కూర్చుంది.

"మనం వచ్చి సంవత్సరం కూడా కాలేదు. అప్పుడే బదిలీ యెలా వచ్చింది? మూడు సంవత్సరాలకుగాని యివ్వకూడదని రూలేదో వుంది కదా!"

"రూల్సు వున్నాయిగాని వాటిని పాటించే దెవ్వరు? మా ఆఫీసరుగారు ఆరేళ్ళ నుంచి వుంటున్నారు. ఆయనే నాకు ట్రాన్స్‌ఫర్ యిచ్చింది."

"ఎవ్వరో లంచం యిచ్చి వుంటాడు."

పందిరివేస్తున్న అతను వీరి సంభాషణ వింటూ "అమ్మా, పందిరి వేయమంటారా!" అని అడిగాడు.

"సగంలో యెలా ఆపుతావయ్యా? వేయి" అని, "ఏమండీ! అలా కూర్చుండిపోతే యెలా? అందరూ ట్రైచేసుకున్నట్లు మనం ట్రైచేసుకుందాం. వాళ్ళు వేశారని మనం వెళ్ళాలా? లేవండి! లేవండి! మా అన్నయ్య దగ్గరకు వెళ్ళండి! ఆ వూరి యం.ఎల్.ఎ. బాగా తెలుసు. మీ మినిష్టరుకి సిఫార్సు చేస్తాడు. కావాలంటే నా గాజులు తాకట్టుపెట్టి డబ్బు తీసుకువెళ్ళండి" ఆ రోజే భర్తని తన అన్నయ్య దగ్గరకు పంపింది వరలక్ష్మి.

సింహాసనం లాంటి కుర్చీలో దర్బారుకు వచ్చిన మహారాజులాగ రమణాజీ ఆసీనుడయ్యాడు.

హెడ్ గుమస్తా, గుమస్తాలు చేతులు కట్టుకుని అతి వినయంగా నిల్చుని వున్నారు. ఒకటి రెండు ఫైల్సుమీద సంతకం చేసిన రమణాజీ అలసిపోయినట్లు వళ్ళు విరుచుకున్నాడు.



ఆ సమయాన శంకరప్ప తన కష్టసుఖాలు వ్రాసుకున్న విన్నతిపత్రంతో యం.యల్.ఎ. వ్రాసిన సిఫార్సు పత్రం జోడించి రెండు చేతులతో పట్టుకుని అలాగే నమస్కారం చేస్తూ అతి వినయంగా వంగి, వంగి వచ్చి బల్లమీద పెట్టాడు.

పెద్ద కుర్చీలో యెలుకలా కదిలాడు రమణాజీ. ఆ వుత్తరాన్ని యెడంచేత్తో తీసి అలా కళ్ళతో చదివి పళ్ళు బిగపెట్టి కళ్ళు ఎరుపు చేసుకుని ఆ కాయితాలను శంకరప్ప ముఖాన కొట్టాడు "యు ఫూల్! యూ రాస్కెల్" అంటూ.

"నీ కెంత ధైర్యం! నా దగ్గరికా నీవు రెకమెండేషన్స్ తెచ్చేది! నే నెలాంటి ఆఫీసర్ని? యిలాంటి ఉత్తరాలంటే నా కసహ్యం అని నీకు తెలియదా?" నొసలు యెగురవేశాడు రమణాజీ. కళ్ళు పెద్దవిగా చిన్నవిగా చేసి చూస్తూ వంకరగా నవ్వాడు. "నాకు ట్రాన్స్‌ఫర్ వద్దు - వద్దు అని ప్రతివాడు అంటే వెళ్ళేది యెవ్వరోయ్! సంవత్సరాల కొద్ది వున్న ఊళ్లో పాతుకుపోతే యెలాగ? గవర్నమెంటు వుద్యోగం అన్నాక బదిలీలు వుంటాయి. వాళ్ళు చెప్పినట్లు వినటం మన విధి! మన డ్యూటీ!"

శంకరప్ప యేదో చెప్పుకోటానికి నోరు విప్పాడు.

'షటప్' అన్నట్లు చూశాడు. చూసి "వూఁ........నీకు యం.ఎల్.ఎ.లు మినిష్టర్లు తెలుసన్నమాట. పెద్దవాడివే. అక్కడనుంచే తెచ్చుకోవోయ్ ఆర్డర్లు! ఒకసారి వేసిన ఆర్డర్లు కాన్సిల్ చేయటం నా మతం కాదు. యు కెన్ గో!" తల తిప్పి హెడ్ వైపు చూశాడు ఎలా వుంది నా లెక్చర్, నా ఇంగ్లీష్ అన్నట్లు.

హెడ్ ప్రశంసిస్తూన్నట్లుగా తలవూపాడు.

"వెధవలు, చవటలు - పనీ పాటా లేదు. వున్న వూర్లోనే వుంటూ సంపాదన నేర్చారు. బదిలీ అంటే చాలు మూట పట్టుకునిపోతారు. అక్కడ ఆ నాయకులు దేశం గురించి, వారు చేయవలసిన పని గురించి వారికి తెలుసో తెలియదోగాని ఇలాంటి బాపతుగాళ్ళను వెంట పెట్టుకుని మినిష్టర్ల యిండ్లకు పోతుంటారు. ఈ పనిలో వారికి తీరిక వుండదు. ఇదో పెద్ద రాకెట్! ప్రమోషన్లు-ట్రాన్స్‌ఫర్లు - పర్మిట్లు - పీళ్ళతో నిండిపోయి వుంటాయి హోటళ్ళు. రామ! రామ! మనదేశం బాగుపడే దెప్పుడు?

నాలాంటి ఆఫీసర్లు వుంటే మాత్రం అలా గాలికి కొట్టుకుపోతుంటారు." లెక్చర్ దంచి, దంచి అలసిపోయాడు రమణాజీ.

* * *

లలితాదేవి నాటిపోయిన నిమ్మ మొక్క పెద్ద చెట్టు అయి నిండుగా కాయలు వేసింది.

'ఓ రెండు వందల కాయలు కోసి వుంచు అమ్మాయికి పంపాలి' అని పనివాడికి పురమాయిస్తూ వుంటే హాలులో ఫోన్ మోగింది.

"సుందూ!" అవతల రమణాజీ గొంతు బొంగురుగా, బాధగా వినిపించింది.

వారి స్వరం అలా బాధగా ధ్వనిస్తూం దేమిటి? యెప్పుడూ సింహంలా పలికే కంఠం దీనంగా 'సుందూ' అంటున్న దేమిటి?

తనవాళ్ళందరూ బాగున్నారు కదా!

పెద్దమ్మాయి లిద్దరికి పెళ్ళిళ్ళు చేశారు. అబ్బాయిలు యిద్దరూ ఉద్యోగాలల్లో వున్నారు. వాళ్ళ దగ్గరనుంచి యేదయినా అశుభవార్త రాలేదు కదా? అని సుందరి తలుస్తూ "ఏమండీ?! అంది ఆదుర్దాగా.

"సుందూ! మనకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. యిప్పుడే టపాలో చూశాను" భారంగా పలికాడు.

"అమ్మో! యిప్పుడు ట్రాన్స్‌ఫర్ వస్తే యెలాగ? చెట్టు నిండుగ నిమ్మకాయలు, మునగ కాయలు, మామిడి కాయలు వున్నాయి. అవన్నీ యేమయిపోవాలి?"

కమ్మటి వాసన వస్తుంది. పోపులో కరేపాకు వేశాడు వంటవాడు.

ఇంత పెద్ద బంగళాలో చిలకా గోరింకలా యిద్దరూ యెంత హాయిగా వున్నారు.

"సుందరీ,"

"విన్నానండి. ఇదెక్కడి అన్యాయం! ఎవ్వడికి పుట్టిం దీ పాడుబుద్ధి? ఎవ్వడో ఓర్వ లేనివాడు చేశాడు. మనం వచ్చి ఆరేళ్ళగా

అయిందీ? అంటే మరో నాలుగేళ్ళయినా వుంటామని అనుకున్నాం కదా! సెలవలకి చిన్నమ్మాయివాళ్ళు వస్తామన్నారు. అల్లుడికి మన రాజసం - దర్బారు చూపించవద్దా! ఇంతకీ యే వూరు వేశారు?"

"హైదరాబాదా! వోరి నాయనో, అక్కడ మనలను యెవ్వరు చూస్తారు! ఎంత పెద్ద ఆఫీసరయినా గుమస్తాలాగానే కదా! చద్ది తిని ఫైల్సు చేతపట్టుకుని బస్సు కొరకు పరుగెత్తాలి. ఆఫీసు కారు వుంది కదా అని యిన్నాళ్ళు కారు కొనలేదు. అదొక దండగ అనుకున్నాము. వోరి భగవంతుడా? ఇప్పుడు మన కెన్ని కష్టాలు? ఇంత బంగళా హైదరాబాదులో యెక్కడిదీ? రెండు వేలు పెట్టినా వస్తుందా? ఏమండోయ్! యింకా అక్కడే కూర్చున్నారా? రండి! కొంపదీసి మనకి బదిలీ అని యెవ్వరికైనా చెప్పారా?"

"లేదు - లేదు - అయినా నీవు నా తెలివిని తక్కువగా అంచనా వేస్తున్నావు డార్లింగ్?" అంటూ ఫోన్ పెట్టేశాడు.

గది బయట పొంచి ఈ సంభాషణ ఇంట్లో పనివాడు, ఆఫీసులో అటెండర్ అంతా విన్నారు.

రమణాజికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అది గాలి కంటే వేగంగా ఆ డివిజన్ అంతా పాకిపోయింది.

* * *

రమణాజి ఏకాంత మందిరంలో భార్యతో చర్చలు సాగించాడు.

ఇప్పుడు హై లెవల్లో తనకు తెలిసినవాళ్ళెవ్వరూ లేరు. కొందరు దిగిపోయారు, మరికొందరు విలువలేకుండా పోయారు.

ఇప్పుడు ఎలాగ? అని ఆలోచనలోపడ్డాడు.

నిన్నగాక మొన్న బదిలీ అయిపోయిన శంకరప్ప గుర్తుకు వచ్చాడు. అతను తన గుమాస్తా. కాకితో కబురు పంపినా వస్తాడు. ఆఫీసు పనిమీద టెలిగ్రాం ఇచ్చి పిలిపించాడు.

శంకరప్ప పే....ద్ద ఆఫీసర్ ముందు చేతులు కట్టుకుని నిలుచున్నాడు.

అతన్ని చూస్తూనే రమణాజి "హి....హి...రావోయ్! ఇటు కూర్చో" అంటూ ముందు కుర్చీ చూపించాడు.

మరీ బలవంతం చేస్తుంటే కూర్చోకుంటే బాగోదని కుర్చీ చివర్లో సీటు అనించి బరువంతా కాళ్ళమీద వేసుకుని కూర్చున్నాడు.

"చూడు మిస్టర్ శంకరప్ప! నీకు ఆ యం ఎల్ ఎ బాగా తెలుసు కదూ? ఆయన మాట మన మినిస్టర్ బాగా వింటాడని వినికిడి. వారిద్దరు బాల్య స్నేహితులట. అరే ఒరే! అని పిలుచుకునే స్నేహం వుందట. నీవు....నాకు చిన్న సహాయం చేయాలి. నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. కాస్త ఆయనకి చెప్పి కాన్సిల్ చేయించాలి. నీకు తెలియంది యేముందీ! మీ అమ్మగారిక్కి....అదే నా వైఫ్‌కి వంటో బాగుండటంలేదు. ఇక్కడ డాక్టర్ బాగా అలవాటైపోయారు. ఈ సమ్మర్‌లో వెళ్ళాలంటే కష్టం. పైగా చిన్నమ్మాయి వస్తానంది. చెప్పుకుంటే అన్ని కష్టాలే! ఆ....ఖర్చుకు భయపడకు - ఎంత కావాలో అంత తీసుకు వెళ్ళు."

ఆనాడు సింహంలా గర్జించి నీతులు మాట్లాడినతను పిల్లిలా దీనంగా చూస్తూ కుక్కలా తోకాడిస్తున్నాడు.

ఆ రోజు అతనిచ్చిన వుపన్యాసాలు ఇప్పుడేమైనవి? అతని పిల్లలందరూ సెటిల్ అయిపోయారు. వున్నది ఇద్దరు. ఎక్కడికి వేస్తే అక్కడికి పోవటానికేం జబ్బు! ఈ వూరిలో ఆరేళ్ళు వున్నది చాలదా? ఛూ! అని ముఖాన వూయాలనిపించింది శంకరప్పకి. నీతుల్సు చిన్నవాళ్ళకేనా? పెద్దవాళ్ళకి వర్తించవా? అని నిలదీసి అడగాలనిపించింది. కాని అవన్ని వారికి తెలియవా? తెలుసు. క్రిందికి వంగి చూసుకోరు అంతే! గురివిందగింజ వంటివారు అని తలుస్తూ ఆఫీసర్ యిచ్చిన డబ్బును తీసుకని రెకమెండేషన్ కొనుక్కురాను వెళ్లాడు శంకరప్ప.



# పోయినోళ్ళు ఉన్నోళ్ళ చేదుసురుతులు

"మొగుడనే వాణ్ని నేను వున్నానని గురుందా?"

"ఉండకపోతే ఎట్టా మాట్లాడతానయ్యా?"

"అట్టా మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పానే! నీ ఎదవ బతుక్కి తోడు నాకాడ తెలివిగా మాట్లాడావా?" సోమయ్య రవణమ్మని గుంజ కేసి బాదేస్తున్నాడు. ఒంటి గుంజమీద నిలబడ్డ పూరికొంప గాలిలో దీపంలా ఒణికిపోతున్నాది. జాతరలో దుకాణాల ముందు మూగినట్లు జనం మూగి చూస్తున్నారు.

సోమయ్య గుడిశదగ్గర ఇది రోజూ జరిగే తంతు. ఆ గుడిశల్లో వాళ్ల సాయింత్రం అయేసరికి ఆరుబయట అన్నాలు పెట్టుకొని ఎంత అసంకల్పితంగా తింటారో అంతగా వీళ్ళతంతు గూడా చూసి ఆనందిస్తుంటారు. అక్కడున్న యాభై గుడిశల్లో కనీసం రెండుమూడు అయినా సాయంత్రంఅయేసరికి ఇలాంటి కార్యక్రమాలు ఉచిత వినోదంగా అందిస్తుంటాయి. అందులో మొగాళ్ళకి పెళ్ళాల్ని కొట్టడం ఒక స్టేటస్. తమ మగతనానికి నిదర్శనంగా భావిస్తుంటారు. వారానికొకసారయినా పెళ్ళాంమీద చెయ్యి చేసుకోనివాడు వాజమ్మకిందే లెక్క!

యాభైలోపడ్డ ముసలాళ్లు కుర్రాళ్ళని ఏడిపించడానికయినా "పెళ్ళాన్ని ఎప్పుడన్నా కొట్టినావా?" అంటూ వుంటారు. వాళ్ళంతా ఒడుదుడుకులున్నవాళ్లు కారు.

చదువుకున్నా పోతన పద్యం అసలు చదువుకోలేదు.

ఆ గుడిశలన్నిటికీ కలిపి ఒక కట్టు వుంది. మొగుణ్ని అదేమనగూడదు. కానీ మొగుడు కొట్టడం మొదలుపెట్టాక అతన్ని అడ్డమయిన బూతులూ తిట్టవచ్చు. ఆడదానికి తిట్టే అధికారం మొగాడికి కొట్టే అధికారం ఏ రాజ్యాంగం నుంచీ వాళ్లు తీసుకోలేదు. వాళ్ళంతట వాళ్ళే సాంప్రదాయకంగా నిలుపుకొంటున్నది అది.

జీవితంమీద రోతపుట్టినా కూలి గిట్టుబాటు కాకపోయినా నాటు ఫుల్‌గా తలకి ఎక్కినా ఆ రాత్రి మొగాడు పెళ్ళాన్ని ఏమయినా చేస్తాడు. అతను ఏంచేసినా రెండుమూడు గంటలు నేపు చుట్టూ ప్రేక్షకులు పట్టించుకోరు.

ఈ తతంగానిక్కి ఆరు వందవర్ష ప్రణాళికల వయస్సు వుంది.

నాంచారు మొగుడికి స్నానం చేయిస్తూ ఓ కంట జరుగుతున్నదంతా గమనిస్తున్నాది. పెళ్ళాం ధ్యాస ఇక్కడ లేదని వాడికి తెలుస్తున్నాది. జాకెట్ కిందగా వీపుమీద మెల్లిగా ఒకటి తగిలించాడు. నాంచారు కెవ్వుమని ఈ లోకంలోకి వచ్చింది.

"నీ చెయ్యిడిపోను! ఏందీ మోటుదనం?" నాంచారు ఎర్రబడ్డ వీపుమీద వేలేసి రాసుకుంటూ అంది.

"మోటుదనం లేకపోతే మొగుడెట్లా అవుతాడే?" వెంకడు కిసుక్కున నవ్వాడు.

నాంచారుకి పెళ్ళయి ఆరు వారాలయింది. 'దానియేలుపేట' గుడిశల్లోకి వచ్చి కాపరంపెట్టి

'ప్రశాంత'